సాక్షి
నిర్మల్

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



బాలుడిని కాటేసిన విద్యుత్ కంచె

ఖానాపూర్‌లో పెరటితోట చుట్టూ అమర్చిన విద్యుత్ కంచె ఓ బాలుడి ప్రాణం తీసింది. ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని బాలుడి కుటుంబీకులు రాస్తారోకో చేశారు. 8లో▸



పక్షులు మెరిసే.. బర్డ్‌వాచర్లు మురిసే

జన్నారం రేంజ్‌లోని బైసన్‌కుంట, మల్యాల వాచ్‌టవర్ ప్రాంతాల్లో పక్షి ప్రేమికులు పర్యటించారు. వివిధ రకాల పక్షులను గుర్తించారు. వెంటనే తమ కెమెరాల్లో బంధించారు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.4 / 16.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

రాజన్న ఆలయంలో నాగుపాము



ఆలయంలో దర్శనమిచ్చిన నాగుపాము

దస్తురాబాద్: మహాశివరాత్రి పర్వదినాన మండలంలోని గోడిసిర్యాల రాజన్న ఆలయ గర్భగుడిలో శనివారం అర్ధరాత్రి భక్తులకు నాగుపాము దర్శనమిచ్చింది. ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించిన అనంతరం నాగుపాము కనిపించడం ఆనవాయితీ. నాగుపాము దర్శనం అనంతరం ఆలయంలో లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్ రాజన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్


బసవేశ్వరాలయంలో 'ఏలేటి' పూజలు



ఆలయ చరిత్ర తెలుసుకుంటున్న మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని యాకర్‌పెల్లి గ్రామంలోని బసవేశ్వరాలయంలో ఆదివారం ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ అధ్యక్షుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నాయకుడు రాజేశ్వర్‌రెడ్డిని కలిసి ఆలయ చరిత్ర తెలుసుకున్నారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ పునర్నిర్మాణం, బసవేశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులున్నారు.

వైఎస్సార్‌టీపీ యూత్ జిల్లా అధ్యక్షుడిగా శేషాద్రి



నియామకపత్రం అందుకుంటున్న శేషాద్రి

ఖానాపూర్: వైఎస్సార్‌టీపీ యూత్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన శ్రీపాద శేషాద్రి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు యూత్ రాష్ట్ర కోఆర్డినేటర్ గడ్డం ఇంద్రజారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో పార్టీ పదవి ఇచ్చిన అధ్యక్షురాలు షర్మిలతో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధి గట్టు రాంచందర్, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డికి నూతన అధ్యక్షుడు శేషాద్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పూజలు

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో గల శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శర్మన్‌నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. జన్నారం మండలానికి చెందిన శర్మన్‌నాయక్ మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అతడిని శాలువాతో సన్మానించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

ఖానాపూర్: జిల్లా కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించే సేవాలాల్ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేడుకలకు బంజారాలు, విద్యార్థులు, ఉద్యోగులతోపాటు కళాకారులు తదితరులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మళ్లీ పాత కథేనా?



విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట షెడ్డు వేసేందుకు తెచ్చిన సామగ్రి

- రూ.ఏడు కోట్లు రోడ్డుపాలేనా?
- నడిచేందుకు 'రహదారి' లేదు
- 'ఉపాధి'కి దుకాణమూ లేదు
- ఎటూ సెట్ కాని 'ఏడుకోట్ల బాట'
- బల్దియా తీరుపై విమర్శల మూట



నిర్మల్ మున్సిపల్ కార్యాలయం



ఫారెస్ట్ ఆఫీస్ వద్ద నుంచి తొలగించి మున్సిపల్‌లో పడేసిన పెర్గోలా (ఫైల్)

నిర్మల్: 'వావ్.. నిర్మల్ మస్తు మారిపోయింది. పచ్చనిచెట్లతో డివైడర్లు, మధ్యమధ్యలో రంగురంగుల నీళ్ల ఫౌంటెన్లు, రోడ్డుకు ఇరువైపులా చక్కటి రెయిలింగ్‌తో ఫుట్‌పాత్‌లు.. రాత్రిపూట విద్యుత్‌కాంతులు.. నిజంగా నిర్మల్ మస్తు మారింది..' ఇలా రెండేళ్ల కిందట ఎవరినోట విన్నా ఇదే మాట. కానీ.. ఇప్పుడు పచ్చనిచెట్లు ఎండిపోతున్నయ్. ఫౌంటెన్లు పనిచేయడం మానేశాయ్. ఇక నిర్మల్‌కు ప్రత్యేకంగా నిలిచిన ఫుట్‌పాత్ 'పాతకథ'కే రంగులు అద్దుకున్నట్లు తయారైంది. బాటసారుల దారిపై మళ్లీ పాత దుకాణాలే వెలుస్తున్నాయి. ఈసారి మరింత పకడ్బందీగా, పాలకపక్షం అండతో ఏర్పాటవుతున్నాయి. ఫుట్‌పాత్‌ల ఏర్పాటు సమయంలో తీసేసిన దుకాణాదారులకు ఇచ్చిన సమీకృత మార్కెట్ ఏర్పాటు హామీని అటకెక్కించారు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని సదరు బతుకుజీవులు మళ్లీ దుకాణాల ఏర్పాటుకు కౌన్సిలర్లు, నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఎక్కడ ఫుట్‌పాత్‌పై దుకాణం పెట్టినా స్థానికులతో గొడవ, పోలీసులతో తగాదాలు పడాల్సిన దుస్థితి.

రూ.ఏడు కోట్లు పెట్టి..

జిల్లా కేంద్రంగా మారిన తర్వాత నిర్మల్‌లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రోత్సాహంతో 2021లో అప్పటి కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ నిర్మల్‌లో ప్రతిష్టాత్మకంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. ప్రముఖ కాంట్రాక్టర్ లక్కడి జగన్‌మోహన్‌రెడ్డి ఈ పనులను శరవేగంగా పూర్తి చేశారు. ఫుట్‌పాత్‌తో పాటు రెయిలింగ్, పెర్గోలాలు, కుర్చీలు, పెయింటింగ్‌లతో ముస్తాబు చేశారు. 2022 జూలై 6న మంత్రి ఐకేరెడ్డి అప్పటి మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న అరవింద్‌కుమార్‌తో కలిసి ఫుట్‌పాత్‌ను ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాతే పాత కథ మొదలైంది.

వీధివ్యాపారులకేదీ దారి..

'పొద్దున్నుంచి రాత్రిదాకా ఎండనకా వాననకా రోడ్డుపై దందా చేసుకుంటేనే భార్యాబిడ్డలను పోషించుకోగలం. ఏ ఒక్కరోజు నడవకున్నా తిండికి తిప్పలు పడాల్సిందే. అలాంటి మాకు ఇప్పటికీ సరైన 'దారి' చూపెట్టడం లేదు..' అంటూ పలువురు స్ట్రీట్‌వెండర్స్ వాపోతున్నారు. తమ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొంతమంది ప్రజాప్రతినిధులు, నాయకులు డబ్బులిస్తేనే దుకాణం పెట్టిస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాళ్లను నమ్మి డబ్బులిచ్చి వెళ్తే, రేప్పొద్దున మళ్లీ పోలీసులు, అధికారులు దుకాణాలను తొలగిస్తే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధివ్యాపారుల జీవనోపాధి కోసం సహకరించాల్సిన ప్రభుత్వం తమను ఏవిధంగా ఆదుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తమకు ఒక చోటంటూ చూపించాలని కోరుతున్నారు.

ముందుచూపేది?

బాటసారుల కోసం కట్టిన ఫుట్‌పాత్‌ను కాపాడలేక, అటు సమీకృత మార్కెట్‌ను కట్టలేక, ఇటు వీధి వ్యాపారులకు సరైన చోటు చూపించలేక మున్సిపల్ చేతులెత్తేసిందన్న ఆరోపణలున్నాయి. ముందు చూపు లేని బల్దియా తీరుతోనే రూ.ఏడు కోట్లు రోడ్డుపాలయ్యాయన్న విమర్శలూ వస్తున్నాయి. జిల్లా ఏర్పడిన తక్కువకాలంలోనే 'రాయల్ నిర్మల్'గా పేరుతెచ్చిన పనులే.. ఇప్పుడు విమర్శలకు కారణంగా మారుతుండడం పాలకులకూ ఇబ్బందిగానే మారుతోంది. ఇప్పటికైనా బాటసారులు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కాకుండా ఫుట్‌పాత్‌ను సెట్‌చేయడంతో పాటు వీధివ్యాపారులకూ సరైన 'దారి' చూపాలని నిర్మల్‌వాసులు కోరుతున్నారు.

ఎందుకంటే?

జిల్లా కేంద్రంలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం చాలాచోట్ల రోడ్లపై దుకాణాలు పెట్టుకుని జీవనం సాగిస్తున్న వారి దందాలను తొలగించారు. అప్పట్లోనే ఈ వీధి వ్యాపారులకు సరైన స్థలం చూపి శాశ్వతంగా వ్యాపారాలు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న ఖాళీస్థలంలో సమీకృత మార్కెట్ నిర్మిస్తామని, అందులో అందరికీ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నెలలు గడిచినా ఆ మార్కెట్ ముందుకు సాగలేదు. మరోవైపు తమకు బతుకుదెరువు లేక సదరు వీధి వ్యాపారులు తిరిగి రోడ్డెక్కారు. తాజాగా విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద షెడ్డు వేసేందుకు ప్రయత్నించగా అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు.

శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి



విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం భైంసాలోని నిర్మల్ చౌరస్తాలో శివాజీ జయంతి నిర్వహించారు. శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. హిందూవాహిని మహిష శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు రామారావ్‌పటేల్, మోహన్‌రావ్‌పటేల్, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ హాజరయ్యారు. ముందుగా ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సంయోజక్ ఉప్పల రాజన్న, భైంసా నగర సంఘ్‌చాలక్ సాదుల కృష్ణదాస్, విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ముష్కం రామకృష్ణాగౌడ్ తదితరులున్నారు.

ఏరియాస్పత్రి ఆర్‌ఎంకు సన్మానం



గోపాలకృష్ణను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ ఆలయాన్ని నిర్మల్ ఏరియాస్పత్రి ఆర్‌ఎం డాక్టర్ గోపాలకృష్ణ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ శ్రీవిద్య, ఎస్సై రాహుల్, ఆలయ కమిటీ చైర్మన్ సురేశ్‌రెడ్డి, సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్రకు మన పత్తి

- తరలిపోతున్న తెల్లబంగారం
- అక్కడ క్వింటాల్‌కు రూ.300 అధికం
- స్థానికంగా గిట్టుబాటు ధర కల్పించడంలో అధికారులు విఫలం



మహారాష్ట్రకు వ్యాన్‌లో తరలుతున్న పత్తి

భైంసాటౌన్: మన పత్తి మహారాష్ట్రకు తరలిపోతోంది. గతేడాదిలా.. ఈసారి కూడా సీజన్ చివరన ధర పెరుగుతుందన్న ఆశతో మూడు నెలలుగా ఇళ్లలో నిల్వ చేశారు. కానీ, ధరలో పెద్దగా పెరుగుదల కనిపించడం లేదు. పెరుగుతుందన్న ఆశలు కూడా సన్నగిల్లుతున్నాయి. మరోవైపు పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి. దీంతో విధిలేని పరిస్థితిలో నిల్వ చేసిన పత్తిని విక్రయిస్తున్నారు రైతులు. స్థానికంగా ఉన్న ధర కంటే పొరుగున ఉన్న మహారాష్ట్రలో క్వింటాల్‌కు రూ.200 నుంచి రూ.300 వరకు అధికంగా చెల్లిస్తున్నారు. దీంతో రైతులు తెల్లబంగారాన్ని పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు.

గిట్టుబాటు కాక ఇళ్లలో నిల్వ..

గతేడాది పత్తి సీజన్ ముగింపు సమయంలో క్వింటాల్ పత్తి రూ.12 వేల వరకు పలికింది. దీంతో ఈ ఏడాది జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది. గత జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలు, పోటెత్తిన వరదలకు పత్తిచేలు దెబ్బతిన్నాయి. తర్వాత తెగుళ్లు చేలకు నష్టం కలిగించాయి. దీంతో దిగుబడి చాలావరకు తగ్గింది. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 6 నుంచి 8 క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చింది. ఈ ఏడాది పత్తికి మద్దతు ధర ప్రభుత్వం రూ.6,300గా నిర్ణయించింది. మార్కెట్‌లో ప్రారంభంలో క్వింటాల్‌కు వ్యాపారులు రూ.9 వేల వరకు చెల్లించారు. పత్తి సేకరణ పుంజుకున్న తర్వాత ధర అమాంతం పడిపోయింది. ఒకదశలో రూ.7 వేలకు చేరుకుంది. దిగుబడి తగ్గి పెట్టుబడి పెరిగిన ప్రస్తుత రుణంలో విక్రయిస్తే గిట్టుబాటు కాదని 70 శాతం మంది రైతులు పత్తిని ఇళ్లలో నిల్వ చేశారు. గతేడాదిలా సీజన్ ముగింపు సమయంలో రూ.10 వేల వరకు పెరుగుతుందని భావించారు. కానీ.. రెండు నెలలుగా ధర క్వింటాల్‌కు రూ.8 నుంచి రూ.8,500 దాటడం లేదు. దీంతో కొందరు డీసీఎం, లారీల్లో మహారాష్ట్రకు తీసుకెళ్తున్నారు. భోకర్, ధర్మాబాద్, నాగ్‌పూర్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు మన మార్కెట్ ధరకంటే రూ.200 నుంచి రూ.300 అధికంగా చెల్లిస్తున్నారు. మరికొందరు రవాణా చార్జీలకు భయపడి స్థానికంగానే దళారులకు విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్ సెస్ రూపంలో వచ్చే ఆదాయానికి గండి పడుతోంది.

ధర కల్పించడంలో విఫలం

పత్తికి స్థానికంగా గిట్టుబాటు ధర కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై ధర పెరగకుండా చేస్తున్నారని పేర్కొంటున్నారు. పొరుగున మహారాష్ట్రలో వ్యాపారులు అధిక ధర చెల్లిస్తున్నా, స్థానికంగా తక్కువ ధర చెల్లించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, వ్యాపారులు కలిసి తమను నిండా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి ధరల్లో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాగులోకి 'సరస్వతి' నీటి విడుదల



వడ్యాల్ వద్ద వాగులోకి వెళ్తున్న సరస్వతి కాలువ నీళ్లు



చింతల్‌చాంద చెన్న చెరువులోకి..

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామంలోని చెరువులపై ప్రచురించిన 'సాక్షి' కథనానికి స్పందన లభించింది. గ్రామంలోని నాలుగు గొలుసుకట్టు చెరువుల్లో నీరు లేక దాని కింది బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. పంటలు ఎండే ప్రమాదం ఉండగా 'సాక్షి' శనివారం గ్రామాన్ని విజిట్ చేసింది. ఆదివారం చెరువుల స్థితిపై 'గొలుసుకట్టు తడారుతోంది' శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఇరిగేషన్ ఈఈ రామారావు వెంటనే మండలంలోని సరస్వతి కాలువ ద్వారా వడ్యాల్ వద్ద నీటిని వాగులోకి వదిలించారు. వాగు నీటిని లక్ష్మణచాంద ఆనకట్ట ద్వారా తిర్పెల్లి చెరువులోకి.. తిర్పెల్లి చెరువు నుంచి చింతల్‌చాంద గ్రామంలోని ప్రధాన చెరువైన చెన్న చెరువులోకి నీళ్లు వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో చింతల్‌చాంద గ్రామస్తులు, రైతులు, వీడీసీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈనెలాఖరు వరకు గడువు

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే రుణాలు ఇవ్వగా ప్రస్తుతం దివ్యాంగులకూ ఇవ్వనుంది. వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకుల ద్వారా సబ్సిడీపై రుణాలు మంజూరు చేయనుంది. జిల్లాలో 18 మండలాలు, మూడు మున్సిపాలిటీలకు గాను 25 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిలో 22 యూనిట్లను బ్యాంక్‌తో సంబంధం లేకుండా 100శాతం రాయితీతో రూ.50 వేల చొప్పున అందజేయనున్నారు. బ్యాంక్ లింకేజీ ద్వారా మూడు లేదా నాలుగు యూనిట్లు ఇవ్వనున్నారు. 21–55 ఏళ్ల దివ్యాంగులు అర్హులు కాగా, ఈ నెల 28 వరకు tsobmms.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

యూనిట్లవారీగా సబ్సిడీ ఇలా..

సబ్సిడీ రుణాలను మూడు యూనిట్లుగా ప్రకటించారు. రూ.లక్ష యూనిట్‌కు రూ.80వేలు, రూ.2లక్షల యూనిట్‌కు రూ.1.40లక్షలు, రూ.3లక్షల యూనిట్‌కు రూ.1.80లక్షల రాయితీని ప్రభుత్వం ఇవ్వనుంది. రాయితీ పోనూ మిగతా మొత్తాన్ని బ్యాంక్ కలిపి రుణంగా అందజేస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆసక్తి, అర్హత గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 28వ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు మా కార్యాలయంలో సంప్రదించాలి. – విజయలక్ష్మి, జిల్లా సంక్షేమాధికారి

రూ.10 కోట్ల బడ్జెట్ కేటాయించాలి



తెలంగాణ దివ్యాంగుల సంక్షేమశాఖ జిల్లా కమిషనర్ దివ్యాంగులపట్ల మొండిగా వ్యవహరిస్తున్నారు. 2022–23 యాక్షన్‌ప్లాన్‌లో జిల్లాకు 25 యూనిట్లకు కలిపి రూ.15లక్షలు మాత్రమే కేటాయించారు. జిల్లాకు రూ.10కోట్ల బడ్జెట్ కేటాయించాలి.
– నట్టి సాయన్న, తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

బాసరలో 'మహా' వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భైంసా: బాసరలో మహాశివరాత్రి వేడుకలు ఆదివారం కొనసాగాయి. ఆలయంలో ఢమరుకం, శంఖం ఆకృతిలో భక్తులు దీపాలు వెలిగించారు. అమ్మవారి ఆలయంలో జాగరణ చేశారు. వ్యాసమహర్షి ఆలయంలో కుకుటేశ్వర, పాపహరేశ్వరాలయంలో గోదావరినది ఒడ్డున సూర్యేశ్వరాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.



ఆలయంలో దీపాలంకరణ

అలరించిన కుస్తీ పోటీలు



పోటీలో తలపడుతున్న మల్లయోధులు

కుంటాల: మండలంలోని సూర్యపూర్‌లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. సుమారు 150 పోటీలు నిర్వహించగా మహారాష్ట్ర నుంచి వచ్చిన మల్లయోధులు పాల్గొని సత్తా చాటారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఫైనల్ విజేతగా నాందేడ్ జిల్లా భోకర్ తాలూకాలోని బీత్నల్ గ్రామానికి చెందిన రాజు నిలువగా రూ.5 వేలు, రెండో విజేతకు రూ.2,500 నగదు అందించి శాలువాలతో సత్కరించారు. కడియం బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బక్కి సునీత్, ఉప సర్పంచ్ రాజన్న, ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్, వీడీసీ చైర్మన్ పోతన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓలాలో..

మహాశిరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఓలా శివాలయ ఆలయ ఆవరణలో సోమవారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఓ ప్రకటనలో తెలిపారు. మల్లయోధులు అధికసంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ, ముత్యాలమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. అనంతరం పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం

కుభీర్(ముధోల్): మండలంలోని పార్డి(బి)లో ఆదివారం రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. గ్రామం నుంచి మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధమవుతుండగా గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బియ్యాన్ని ఖలీల్ అనే వ్యక్తి డంపు చేసి ఉంచినట్లు తెలిపాడు. పట్టుకున్న బియ్యాన్ని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

బైక్ పైనుంచి కిందపడి ఇద్దరికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

జైనథ్(ఆదిలాబాద్): మండలంలోని ఐబీ చౌరస్తా సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన ధన్‌రాజ్, సల్మాన్ ద్విచక్రవాహనంపై ఆదిలాబాద్ వైపు వెళ్తున్నారు. ఐబీ చౌరస్తా సమీపంలో బైక్ అదుపుతప్పి ఇద్దరూ కిందపడ్డారు. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

కల్వర్టును ఢీకొట్టిన అంబులెన్స్

పెంబి: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో మృతి చెందగా.. మృతదేహాన్ని ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో ఆదివారం తెల్లవారుజామున తీసుకువచ్చారు. తిరుగు ప్రయాణంలో మందపల్లి గ్రామ పెద్దమ్మ ఆలయ సమీపంలో అంబులెన్స్ కల్వర్టును ఢీకొట్టింది. ఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పెంబి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సాత్నాల ప్రాజెక్టు సమీపంలో అగ్నిప్రమాదం

జైనథ్: మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్ సమీపంలోని ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాన్ప గ్రామ సమీపంలోని రహదారి పక్కన అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో గమనించిన స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో పంటచేలకు నీళ్లు అందించే పైపులైన్లతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే దట్టమైన చెట్లు కాలిపోయాయి. స్థానికులు చాకచక్యంగా వ్యవహరించి సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ నూతనంగా నిర్మించిన 37x55 స్థలంలో 4 కొత్త రూములు ఓపెన్ ప్లేస్ కలిపి నిర్మల్ బుధవార్‌పేట్ అమ్మకం. ఫైనల్ రేట్ 2290000. సంప్రః Ph: 9849267884 [HA-994]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులు, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు, కావలెను, ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18 k ఏజెంట్స్ కమీషన్ 3k ఫోన్: 7569955551, 9848571888. [H-786836]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233,9542913344 [M-1190577]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

ఆదివాసీల పోరుబాట

ఇటు అధికారులు.. అటు రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆందోళన బాట పట్టేందుకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. 11 కులాలను ఎస్టీల్లో కలపాలని అసెంబ్లీలో చేసిన తీర్మానంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివాసీ సంఘాలు సైతం తమ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. నేడు ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ముట్టడికి రంగం సిద్ధం చేశారు. ఇందుకు గడిచిన వారం రోజుల నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గూడేల్లో ఆదివాసీల సంఘాల నాయకులు ప్రచారం చేశారు. ఎక్కడికక్కడ ఆదివాసీలను జాగృతం చేసే కార్యక్రమాల్లో తుడుందెబ్బ, దాని అనుబంధ సంఘాల నాయకులు నిమగ్నమయ్యారు.



జైనూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

- అస్తిత్వం కోసం ఆందోళన
- అగ్గి రాజేసిన సీఎం వ్యాఖ్యలు
- హక్కుల కోసం ఉద్యమబాట
- 11 కులాలను ఎస్టీల్లో కలపడంపై నిరసన
- నేడు ఐటీడీఏ ముట్టడికి పిలుపు

ఏజెన్సీలో ఆదివాసీలకు ఎంత రిజర్వేషన్?

ప్రభుత్వం పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. త్వరలో డీఎస్సీ కూడా వేయనుంది. కానీ ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంత వరకు రిజర్వేషన్ కల్పిస్తారనే మీ మాంసలో గిరిజన నిరుద్యోగ యువత ఉంది. ఏజెన్సీలోని ఉద్యోగాలు 100 శాతం గిరిజనులకు వర్తించే విధంగా జీవో నం.3 ఇటీవల సుప్రీంకోర్టు సవరించింది. ఏజెన్సీలో 50శాతం వరకు గిరిజనులకు వర్తింపజేయాలని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మరో 15 తెగలను ఎస్టీలో చేర్చుతామనే ప్రకటనతో కేంద్ర ప్రభుత్వంపై నిరసనలు చల్లారకముందే రాష్ట్ర ప్రభుత్వం మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడంతో నిరసనలు రెట్టింపు అవుతున్నాయి.

కెరమెరి(ఆసిఫాబాద్)/ ఉట్నూర్ : ఆదివాసీల్లో నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఇప్పటికే చాలా కోల్పోయామని.. ఇక కోల్పోవడానికి మా వద్ద ఏమి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం, ఉపాధి లేక వేలాది మంది నిరుద్యోగులు ఆదివాసీల్లో ఉన్నారని, ఎస్టీల్లో మరిన్ని కులాలను చేర్చితే మా భవిష్యత్ ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

కనిపించని చట్టాల అమలు...

గిరిజన(ఏజెన్సీ) ప్రాంతాల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ అవి నిరుపయోగమవుతున్నాయి. ఎక్కడ కూడా ఏజెన్సీ చట్టాల అమలు కనిపించడం లేదు. ప్రత్యేక చట్టాలను రాజ్యాంగంలో పొందుపర్చినప్పటికీ ప్రభుత్వాలే వాటికి తూట్లు పొడుస్తున్నాయి. పెసా, 1/70 తదితర ప్రధాన చట్టాలు ఉన్నప్పటికీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోతున్నాయి. జీవో 317 తీసుకువచ్చి ఏజెన్సీల్లో గిరిజనేతరులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ముఖ్యంగా ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల్లోని నిరుద్యోగులకు చాలా నష్టం వాటిల్లింది. భారత రాజ్యాంగంలోని షెడ్యూల్ తెగల రక్షణకు ఆర్టికల్ 342కు సంబంధం లేకుండా గిరిజన ప్రాంతాల్లో అన్ని కార్యాకలాపాలు చకచకా జరుగుతున్నాయి. 1/70 అమల్లో ఉన్నప్పటికీ ఆ చట్టం కేవలం కాగితాలకే పరిమితమైంది. ఏజెన్సీలోని అటవీ భూములు, స్థిరాస్తులు అన్నీ అన్యాక్రాంతమవుతున్నప్పటికీ అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. 1/70ను 2/70 గా మార్చే కుట్ర జరుగుతోందని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అనాధిగా సాగుచేస్తున్న అటవీ భూముల నుంచి ఆదివాసీలను వెళ్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదివాసీల ప్రధాన డిమాండ్లు..

- ఎస్టీల్లో ఇతర కులాలను చేర్చవద్దు..
- చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి.
- గిరి వికాసం కింద ఆదివాసీలకు బోర్లను మంజూరు చేయాలి.
- ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి.
- జిల్లా, మండల కేంద్రాల్లో నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి
- పెసా, 1/59, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.
- జీవో 3 యథావిధిగా కొనసాగించాలి.
- 29 శాఖల్లో ఉన్న జీవోలను చట్టం చేసి 29 శాఖల్లో ఉన్న ఉద్యోగాలను ఆదివాసీలతో నియమించాలి.
- గిరిజన యూనివర్సిటీ ఆదిలాబాద్ జిల్లాలోనే ఏర్పాటు చేయాలి.
- జీవో 317 రద్దుచేయాలి.
- ప్రత్యేక డీఎస్సీతో ఆదివాసీలచే ఉపాధ్యాయ ఉద్యోగాలు నియమించాలి
- నాన్ ఏజెన్సీ ఆదివాసీ గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా మార్చాలి.
- దళితబంధు మాదిరిగానే ఆదివాసీబంధు ఇవ్వాలి.

ఓటు బ్యాంకు రాజకీయాలు వద్దు



ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోంది. ఇప్పటికే వలసవాదులతో అనేక విధాలుగా నష్టపోయిన ఆదివాసీలకు 11కులాలను కలుపుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం సరికాదు. ఆదివాసీల చట్టాలు, హక్కుల రక్షణ కోసం, ఆదివాసీల అస్తిత్వం కోసం పోరాటాలు చేయడానికి సిద్ధం. – బుర్స పోచయ్య, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు

మనుగడ కోసం పోరాటం చేస్తున్నాం..



ఇప్పటికే ఎస్టీ జాబితాలో లంబాడాలను కొనసాగించడంతో ఆదివాసీ లోకం విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ ఇతర అన్నీ రంగాల్లో తీవ్రంగా నష్టపోతోంది. అన్ని రంగాల్లో వారి పెత్తనంతో ఆదివాసీల అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడింది. మళ్లీ ప్రభుత్వం ఇతర కూలాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం హేయమైన చర్య. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయం కోసం ఆదివాసీల మనుగడను ప్రమాదంలో నెట్టివేస్తోంది. న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం చేస్తాం. – పుర్క బాపురావ్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి

'పరిహారం అందించే వరకూ దీక్ష'



దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

తాంసి(బోథ్): పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న రైతులకు పరిహారం అందించే వరకు దీక్ష కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. రైతులు చేపట్టిన రిలేదీక్ష ఐదోరోజుకు చేరుకుంది. ఆదివారం కాంగ్రెస్ నాయకులు రైతుల దీక్షకు మద్దతు తెలికారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ మల్లేశ్ రైతుల సమస్యలను ఫోన్ ద్వారా సీఎల్పీనేత భట్టి విక్రమార్కకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిష్టన్న, రాజ్‌బలి, రమేశ్, రైతులు నసీరుద్దీన్, స్వామి, నర్సింగ్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

గంగస్నానానికి తరలిన 'భీమన్న'



భీమన్న దేవుడిని తీసుకెళ్తున్న శివసత్తులు

ఇచ్చోడ(బోథ్): మండల కేంద్రంలోని భీమన్న గుట్ట వద్ద ఉన్న భీమన్న దేవుడిని శివసత్తులు(పూజారులు) గంగస్నానం చేయించేందుకు సోన్‌కు తీసుకెళ్లారు. గంగస్నానం అనంతరం నేరుగా భీమన్న గుట్ట వద్ద ఉన్న ఆలయంలో దేవుళ్లను ప్రతిష్ఠించి సోమవారం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు కులపెద్ద పెరుమాండ్ల నారాయణ తెలిపారు. అనంతరం పండుగ నిర్వహించి మొక్కులు తీర్చుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు సామగ్రి దగ్ధం



సామగ్రి చూపుతున్న మహిళ

లక్ష్మణచాంద(నిర్మల్): పూజగదిలోని దీపం కింద పడి ఇంట్లోని సామగ్రి దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రానికి చెందిన సిద్దులవార్ రాములు ఇంట్లోని దేవునిగదిలో పూజచేసి దీపం వెలిగించారు. ఎలుకలు దీపాన్ని నెట్టివేయడంతో కింద ఉన్న బట్టలకు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. ఇంట్లోని నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి.

వివాదానికి దారితీసిన క్రీడాపోటీలు



సంఘటన స్థలంలో పోలీసుల బందోబస్తు



వాగ్వాదానికి దిగుతున్న ఇరుగ్రామాల ప్రజలు

- అంకోలి, అంకాపూర్ గ్రామస్తుల మధ్య వాగ్వివాదం
- పోలీసుల రంగప్రవేశం

ఆదిలాబాద్‌రూరల్: మహాశివరాత్రి సందర్భంగా ఏటా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు రెండు గ్రామాల మధ్య వివాదానికి దారితీశాయి. ఆదిలాబాద్‌రూరల్ మండలం అంకోలి గ్రామ పంచాయతీ పరిధిలోని అంకాపూర్ శివారులో రెండు రోజుల క్రితం అంకనేశ్వర జాతరను అట్టహాసంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం నుంచి కబడ్డీ పోటీలను ప్రారంభించారు.

వివాదం ఇలా..

అంకనేశ్వర జాతర సందర్భంగా అంకోలి గ్రామస్తులు ఏటా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల యువకులు పోటీల్లో పాల్గొంటున్నారు. ఈసారి తాముసైతం క్రీడా పోటీల నిర్వహణలో పాలుపంచుకుంటామని, కబడ్డీతో పాటు వాలీబాల్ క్రీడలు సైతం నిర్వహించాలని అంకాపూర్ గ్రామస్తులు తెలిపారు. ఇందుకు అంకోలి గ్రామస్తులు నిరాకరించడంతో వివాదం మొదలైంది. మాటామాట పెరిగి ఇరుగ్రామాల ప్రజల మధ్య గొడవకు దారి తీసింది. తామే క్రీడాపోటీలు నిర్వహిస్తామని అంకోలి గ్రామస్తులు స్పష్టం చేయడం ఆందోళనకు దారి తీసింది.

పోలీసుల రంగప్రవేశం

ఇరు గ్రామాల మధ్య వివాదం తారాస్థాయికి చేరడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఆదివారం ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ సహా సీఐలు రఘుపతి, పురుషోత్తంచారి, కిరణ్‌లతో పాటు పలువురు ఎస్సైలు, ప్రత్యేక పోలీసు బలగాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయి. గొడవకు కారణాలు తెలుసుకున్న డీఎస్పీ ఇరు గ్రామాల ప్రజలు సైతం క్రీడాపోటీలు నిర్వహించవద్దని సూచించారు. దీంతో పోటీలు మధ్యలోనే నిలిచిపోయాయి. పరిస్థితి మరింత చేయి దాటకుండా ప్రత్యేక పోలీసు బలగాలతో సాయంత్రం వరకూ అక్కడే ఉండి పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు.

చోర్‌గావ్‌లో మహాశివరాత్రి ఉత్సవాలు



సంప్రదాయబద్ధంగా కలశాలతో శోభాయాత్రలో పాల్గొన్న యువతులు



శోభాయాత్రలో పాల్గొన్న రాంసింగ్ మహారాజ్, జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: మహాశివరాత్రి ఉత్సవాలను ఆదివారం మండలంలోని చోర్‌గావ్ మధురతండా శ్రీమూర్తిరాములు(శివాలయం)లో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు, యువతులు, గ్రామస్తులు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. రాంసింగ్ మహారాజ్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌లను శ్రీ మూర్తి రాములు పీఠాధిపతి శ్రీరాం మహారాజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జెండాను ఆవిష్కరించి భోగ్‌బండారో నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఐక్యత, సోదరభావంతో కలిసి మెలసి ఉండాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జీవ వైవిధ్య కమిటీ సభ్యుడు మర్సుకోల తిరుపతి, చోర్గావ్ గ్రామ పెద్దలు రమేశ్ నాయక్, నర్పోడ్, అర్జున్, గోవింద్, మాజీ సర్పంచ్ గజానంద్, బరప్‌సింగ్, షేర్‌సింగ్ పాల్గొన్నారు.

యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

- విగ్రహం ఏర్పాటులో యువకుల తీరు అభినందనీయం
- ఎంపీ సోయం బాపురావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపురావు

జన్నారం: యువకులు ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఆదివారం జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కవ్వాల్ గ్రామానికి చెందిన యువకులు ఐకమత్యంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో యువకులు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో హిందూత్వం పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పథకాలను తమ ఖాతాలో వేసుకుని ప్రధాని పేరు రాకుండా చూస్తుందన్నారు. నియోజకవర్గంలో అనేక గ్రామాలు ఇంకా అభివృద్ధికి నోచడం లేదని ఆరోపించారు. మామిడిపెల్లి, కవ్వాల్ రోడ్డు నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అడవి అనుమతులు పొందేలా చొరవ తీసుకుంటానని తెలిపారు. అదే విధంగా కవ్వాల్ పోచమ్మ ఆలయం వరకు ఎంపీ నిధులతో రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కవ్వాల్‌కు నీరు అందించే విషయంపై ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, జెడ్పీటీసీ జానుబాయి, సర్పంచ్ లక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, సర్పంచులు అశోక్‌రావు, గంగాధర్, ఎంపీటీసీ కొంతం శంకరయ్య, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, నియోజకవర్గ ఇన్‌చార్జి హరినాయక్, మండల నాయకులు ఉట్కూరి శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రావు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు వెడ్మ బొజ్జు, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు



చనిపోతానని బెదిరిస్తున్న సుమిత్

గుడిహత్నూర్(బోథ్): ప్రేమిస్తున్నానని యువతి వెంటపడడమే కాకుండా తను ప్రేమించకుంటే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటానని వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని తోషం బాలుర ఆశ్రమ పాఠశాలలో వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ యువతిని ఇంద్రవెల్లికి చెందిన సుమిత్ ప్రేమిస్తున్నానంటూ కొంత కాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆదివారం ఆశ్రమ పాఠశాలకు వచ్చి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ప్రేమించకపోతే పురుగుల మందు తాగి చనిపోతానని బెదిరించాడు. బయటకు వచ్చి ఎలుకల మందు తాగాడు. ఆశ్రమ పాఠశాల ఉద్యోగుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని రిమ్స్‌కు తరలించారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇచ్చోడ(బోథ్): మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇస్లాంపుర కాలనీకి చెందిన అఫ్రోజ్‌కు గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన అఫ్రోజ్ ద్విచక్ర వాహనంపై ఇస్లాంపూర కాలనీ నుంచి మార్కెట్‌కు వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గుంతలు తప్పించబోయి బైక్ అదుపుతప్పి ఆర్టీసీ బస్సు కిందికి దూసుకెళ్లింది. గమనించిన బస్సు డ్రైవర్ బస్సును అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనలో సదరు యువకుడికి గాయాలు కావడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

బాలుడిని కాటేసిన విద్యుత్ కంచె



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు



ఈశ్వర్ (ఫైల్)

- బాల్ కోసం వెళ్తే కరెంటు షాక్..
- కాపాడేందుకు యత్నించిన తల్లికీ విద్యుదాఘాతం
- మృతదేహంతో బాలుడి కుటుంబ సభ్యుల ఆందోళన

ఖానాపూర్: పెరట్లో పెంచుతున్న కూరగాయల మొక్కలను పందులు, కోతుల నుంచి కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె ఓ బాలుడి ప్రాణం తీసింది. ఈ ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ అజయ్‌బాబు, ఎస్సై ఆర్.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ అటవీ అధికారి బోరేకార్ విఠల్ తన సొంత ప్లాట్‌లో కూరగాయల మొక్కలు పెంచుతున్నాడు. తరచూ కోతులు, పందులు మొక్కలపై దాడి చేస్తుండడంతో విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. ఈ ప్లాట్ వెనుక భాగంలోని ఖాళీ స్థలంలో పిల్లలు ఆటలు ఆడుకుంటున్నారు. ఆదివారం ముదం ఈశ్వర్(12) స్నేహితులతో క్రికెట్ ఆడుతుండగా బంతి విఠల్ పెరట్లో పడింది. బంతిని తెచ్చేందుకు ఈశ్వర్ తన సోదరుడు విఘ్నేశ్వర్‌తో కలిసి వెళ్లాడు. విద్యుత్ కంచెను గమనించకపోవడంతో ఈశ్వర్ విద్యుత్‌షాక్‌కు గురై పడిపోయాడు. అప్రమత్తమైన విఘ్నేశ్వర్ వెంటనే ఇంటికి వెళ్లి విషయం తల్లి దండ్రులకు తెలుపడంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈశ్వర్ తల్లి పద్మ ఆత్రుతంగా బాలుడిని పట్టుకోవడంతో ఆమె కూడా షాక్‌కు గురైంది. కొన ఊపిరితో ఉన్న బాలుడిని స్థానికులతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

మృతదేహంతో ఆందోళన

కోపోద్రిక్తులైన కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహంతో ఆస్పత్రి నుంచి స్థానిక జగన్నాథ్‌రావు చౌరస్తా వరకు రాస్తారోకో చేపట్టారు. ఘటనకు బాధ్యులైన పెరటి యజమానితోపాటు విద్యుత్‌శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐ, ఎస్సై మాట్లాడి బాధ్యుల పై చర్య తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాలుడి తండ్రి రాము ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లివచ్చిన కాసేపటికే..

శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని రాము, పద్మ దంపతులు ఈశ్వర్, విఘ్నేశ్వర్‌తో కలిసి మామడ మండలం బూరుగుపల్లి ఆలయానికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చిన కాసేపటికే పిల్లలు ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. ఈ క్రమంలో ఈశ్వర్ మృతి చెందాడు. అప్పటి వరకు తమతో ఉన్న కుమారుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.